## కొండా లక్ష్మణ్ బాపూజీని ఆదర్శంగా తీసుకోవాలి



బోథ్ : నివాళులర్పిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

బోథ్, జూన్ 2 : ప్రతి ఒక్కరూ కొండా లక్ష్మణ్ బాపూజీని ఆదర్శంగా తీసుకోవాలని పద్మశాలీ సంఘం మండల శాఖ అధ్యక్షుడు ఆసాల సదాశివ్ అన్నారు. ఆదివారం మండలంలోని ధన్నూర్(బీ)లో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శ్రీ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొండా లక్ష్మణ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమ కారుడు, తన మంత్రి పదవిని తృణప్రాయంగా త్యాగం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు సామల సంతోష్, మండలాధ్యక్షులు ఆసాల సదాశివ్, అయిట్ల నారాయణ, జిట్ట శ్రీనివాస్, ఎర్రన్న, బుచ్చన్న, రాజేశ్వర్, సురేశ్, దోపతి రాజు పాల్గొన్నారు.

## ర్యాండమైజేషన్ ప్రక్రియపై వీడియోకాన్ఫరెన్స్

ఎదులాపురం, జూన్ 2 : కౌంటింగ్ సిబ్బందికి రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కౌంటింగ్ పరిశీలకుడు అనిల్ కుమార్ పాండే, హిమాన్షు కుమర్ గుప్తా, రిటర్నింగ్ అధికారి రాజర్షి షా సమక్షంలో ఆదివారం పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, డీఈవో రవీందర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో అరవింద్, టెక్నికల్ మేనేజర్ విలాస్ పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపు ప్రాంతంలో రేపు ట్రాఫిక్ ఆంక్షలు

ఎదులాపురం,జూన్2:ఈ నెల4వ తేదీన పార్లమెంట్ ఎన్నికల లెక్కింపు ప్రక్రియ ఉన్నందున పట్టణంలోని 'ఐ లవ్ ఆదిలాబాద్' సింబల్ నుంచి మావల పోలీస్ స్టేషన్ వరకు ఉన్న రోడ్డుపై ట్రాఫిక్ ఆంక్షలు ఉండనున్నట్లు ట్రాఫిక్ సీఐ బీ.ప్రణయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 4 ఉదయం నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు సామాన్య ప్రజలకు అనుమతులు లేవని, పట్టణంలోని అంతర్గత రోడ్లను వినియోగించుకోవాలని సూచించారు. కే ఆర్కే కాలనీ వాసులు తిరుమల పెట్రోల్ బంక్ మీదుగా ఉన్న దారిని వాడుకోవాలని తెలిపారు. హ్యాండిక్యాప్ కాలనీ, ఆర్ఆర్‌నగర్ వాసులు సరస్వతీ నగర్ మీదుగా ఉన్న దారులను వాడుకోవాలని కోరారు.

## ఎల్లమ్మ ఆలయంలో చోరీకియత్నం

దిలావర్‌పూర్, జూన్ 2: దిలావర్‌పూర్ సమీపంలోని ఎల్లమ్మ తల్లి ఆలయంలో ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. ఉదయం పూజారి వెళ్లే సరికి ఆలయం తలుపులు, హుండీ, తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి గ్రామాభివృద్ధి కమిటీకి సమాచారం అందించారు. వెంటనే గ్రామస్తులు ఎస్ఐకి ఫిర్యాదు చేయడంతో డాగ్‌స్క్వాడ్ బృందంతో అక్కడికి వెళ్లి తనిఖీలు చేశారు. ఎస్ఐ సుమాంజలి తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి ప్రయత్నించారని, కేసు నమోదు చేసి వారిని పట్టుకుంటామని తెలిపారు.

## అర్లి(టీ)లో 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత

తాంసి(భీంపూర్ ), జూన్ 2 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని అర్లి(టీ)లో తాజాగా 45.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అర్లి(టీ)లో పదేళ్ల కాలంగా చలికాలం జిల్లాలోనే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీ ఉప కేంద్రాల సిబ్బంది అర్లి(టీ)పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే బాగుంటుంది.

## బాసరలో భక్తుల రద్దీ

బాసర, జూన్ 2 : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. అధికంగా తరలి రావడంతో రద్దీ పెరిగింది. సెలవు దినం కావడంతోపాటు పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న దృష్ట్యా అమ్మవారి దర్శనానికి విద్యార్థులు, భక్తులు అధికంగా తరలి వస్తున్నారు. పవిత్ర గోదావరి లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా అమ్మవారి దర్శనానికి గంటల పాటు క్యూలో వేచి ఉండాల్సి వస్తున్నది.

## విత్తన వ్యాపారిపై కేసు

- మహారాష్ట్ర రైతుకు పత్తి విత్తనాల విక్రయాలు



స్వాధీనం చేసుకున్న విత్తనాలను చూపెడుతున్న డీఎస్పీ జీవన్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి విశ్వామిత్ర

ఆదిలాబాద్, జూన్ 2 ( నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్‌లోని శివాజీచౌక్‌కు చెందిన ఆదిత్య సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ యజమాని సోర్తి రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. జిల్లాలో పత్తి విత్తనాల పంపిణీలో భాగంగా ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందం ఆదివారం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా మహారాష్ట్రకు చెందిన రైతు గోవింద్ నాగోరావు వద్ద 25 ప్యాకెట్ల ఆర్‌సీహెచ్, 8 కబడ్డీ తులసీ కంపెనీకి చెందిన కబడ్డీ పత్తి విత్తనాలు లభించాయి. అధికారుల విచారణలో భాగంగా ఆయన విత్తనాలను ఆదిత్య సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ దుకాణం నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. దుకాణదారు మహారాష్ట్ర రైతుకు అక్రమంగా విత్తనాలను అమ్మడంతో పాటు అధిక ధరలు తీసుకున్నాడని తెలిపారు. ఆదిలాబాద్ అర్బన్ మండలం వ్యవసాయ శాఖ అధికారి విశ్వామిత్ర ఫిర్యాదు మేరకు విత్తనాల దుకాణం యజమాని సోర్తి రమేశ్‌పై 409, 420 సెక్షన్ల కింద నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ సత్యనారాయణ, ఆదిలాబాద్ అర్బన్ మండలం వ్యవసాయ శాఖ అధికారి విశ్వామిత్ర పాల్గొన్నారు.

## అమరుల త్యాగాలను స్మరించాలి

- కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం
- అమరవీరుల స్తూపం వద్ద నివాళి



జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ

ఎదులాపురం, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడి ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి ఆదిలాబాద్‌లోని ఎన్టీఆర్‌చౌక్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. వారి వెంట డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, అధికారులు ఉన్నారు.

## హైదరాబాద్‌కు తరలిన ఉద్యమకారులు



భైంసా నుంచి తరలివెళ్తున్న ఉద్యమకారులు



బోథ్ : జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

బోథ్, జూన్ 2 : హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లోని అధికారికంగా నిర్వహిస్తున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానం మేరకు జిల్లాలోని ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు బయల్దేరి వెళ్లారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ప్రాంగణం నుంచి ఉద్యమకారులతో పాటు, అమరవీరుల కుటుంబ సభ్యులు బస్సులు, వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, డిప్యూటీ ఎస్‌వో వెంకటేశ్వర్లు జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల కో ఆర్డినేటర్ రావుల శంకర్, ఉద్యమకారులు కారింగుల దామోదర్, సామల ప్రశాంత్, బాల శంకర్ కృష్ణ, కళ్లెం ప్రవీణ్ రెడ్డి, మేకల మల్లన్న పాల్గొన్నారు.

**భైంసా నుంచి..**

భైంసా, జూన్, 2 : భైంసా నుంచి తెలంగాణ ఉద్యమకారులు ఆదివారం హైదరాబాద్‌కు వెళ్లారు. వెళ్లిన వారిలో నిర్మల్ జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు ముష్కం రామకృష్ణగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రోల్ల రమేశ్, ఉద్యమ కవి, రచయిత జాదవ్‌పుండలిక్ రావు, శ్రీనివాస రాజు, చాకెటి లస్మన్న, శ్రీనివాస్ యాదవ్, సురేశ్ బయలుదేరి వెళ్లారు.

## అ'పూర్వ' సమ్మేళనం



సమావేశంలో పూర్వ విద్యార్థులు

నిర్మల్ అర్బన్, జూన్ 2 : నిర్మల్ పట్టణంలోని మానస్ ఇన్ హోటల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ పాఠశాలలో 1999-2000 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 25 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు ఒక్కచోట చేరడంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. ఒకరినొకరు కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకుని యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గురువులను శాలువాతో ఘనంగా సన్మానించారు.

## పాఠశాల భవనం యాదిలో..



పాత పాఠశాల భవనాన్ని పరిశీలించిన పూర్వ విద్యార్థులు

కుంటాల, జూన్, 2 : కుంటాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం కనుమరుగవుతున్నది. 50 ఏళ్లకు పైగా ఎందరికో విద్యను అందించిన ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మరి కొద్ది రోజుల్లో కూల్చివేయనున్నారు. గత ప్రభుత్వ హయంలో ఈ పాఠశాల మన ఊరు మన బడి కింద ఎంపిక కాగా రూ.1.53 కోట్లతో నూతన భవనం నిర్మించనున్నారు. ఈ విషయం తెలుసుకొని కొందరు పూర్వ విద్యార్థులు పాఠశాల పాత భవనాన్ని సందర్శించి తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తరగతి గదులు, ఇతర ప్రదేశాలను పరిశీలించి ఫొటోలు తీసుకొని భావోద్వేగానికి లోనయ్యారు. ఎంపీపీ అప్కు గజ్జారాం, డాక్టర్ దాసరి మహేందర్, కృష్ణారావు, పూర్వ విద్యార్థులున్నారు.

## నీ ఒక్కడి వల్ల గెలువలేదు..

- బీజేపీ కార్యకర్తతో ఎమ్మెల్యే రామారావు పటేల్
- ఇద్దరి మధ్య సెల్‌ఫోన్ సంభాషణ వైరల్

భైంసా, జూన్ 2 : నిర్మల్ జిల్లా ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ముథోల్ మండలానికి చెందిన బీజేపీ కార్యకర్తతో జరిగిన సంభాషణ ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ.. 'ఎక్కువ మాట్లాడకు నీ ఒక్కడి వల్ల నేను గెలువలేదు. నీ ఒక్కడి వల్ల ఓట్లు రాలేదు. నీ ఒక్క ఓటుతో నాకేంపని. నీ ఓటు, నీ పెళ్లాం ఓటు మాత్రమే నన్ను గెలిపించిందా..జెండా మోసినంత మాత్రాన లీడర్ అయిపోతవా.. పార్టీ కోసం పనిచేస్తే ఏమైనా చెయ్యాలా..' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఉంది. ఈ విషయంపై ఎమ్మెల్యేను వివరణ కోరగా కావాలనే దురుద్దేశంతో వైరల్ చేశారని, పూర్తి వివరాలు పరిశీలించిన తర్వాత స్పందిస్తానని పేర్కొన్నారు.

## భగీరథ నీరు బంద్

**నీటి కోసం అల్లాడుతున్న 110 గ్రామాల ప్రజలు**



పొలంలోకి వృథాగా వెళ్తున్న నీరు

తాంసి(తలమడుగు), జూన్ 2 : ఉండం గ్రామ శివారులో భగీరథ మెయిన్ పైప్‌లైన్ లీకేజీతో తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల్లోని 110 గ్రామాలకు భగీరథ నీటి సరఫరా నిలిచింది. ఇదంతా అధికారుల నిర్లక్ష్యంతోనే జరుగుతున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో అధికారులు ఆయా గ్రామాల్లో అందుబాటులో లేకపోవడంతో ప్రజలు మంచినీటికి అవస్థలు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో సంబంధిత అధికారులు సాయంత్రం గ్రామాలవారీగా నీటి ట్యాంకు ద్వారా నీరు అందించేందుకు చర్యలు చేపట్టారు.


## జేఎల్‌ఎంకు రాష్ట్ర స్థాయి అవార్డు

బోథ్, జూన్ 2 : తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యుత్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి అవార్డులు అందజేశారు. ధన్నూర్(బీ) గ్రామానికి చెందిన ఏ కిరణ్‌కుమార్ ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఆయనను తోటి ఉద్యోగులు, గ్రామస్తులు, తోటి ఉద్యోగులు అభినందించారు.

## అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

ఇచ్చోడ, జూన్ 2 : మండలంలోని నారాయణ్‌పూర్ శివారులో ముందస్తు సమాచారం మేరకు ఆదివారం అక్రమ కలపను పట్టుకున్నామని అటవీ శాఖ జిల్లా అధికారి ప్రశాంత్ బాజీరావ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 5.30 గంటలకు గుండాల గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు నారాయణ్‌పూర్ గ్రామ శివారులో అక్రమ కలప తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. రాజులగూడ, కుంటగూడ వద్ద మాటు వేసి ఉండగా నలుగురు వ్యక్తులు ఎండ్ల బండిపై కలప నింపుతుండగా వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా ఇద్దరు ఎడ్లను తీసుకుని పారిపోయారని తెలిపారు. పట్టుబడిన వారిలో షేక్ అలీం, షేక్ వాజిద్ ఉన్నారు. పారిపోయిన వారు షేక్ కలీం, షేక్ సరోగా గుర్తించారు. పట్టుబడిన కలప విలువ రూ.50 వేలు ఉంటుందని తెలిపారు. కలపను అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. ఈ దాడిలో ఎఫ్‌బీవోలు విఠల్, సంతోష్, వి.జంగు, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

# రాబడి



## మీ వాహనానికి థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్ ఉందా?

**దేశంలో** వాహనదారులకు మోటార్ బీమా తప్పనిసరి. మీకు కారున్నా.. బైకున్నా.. లేదా మరే వాహనం ఉన్నా.. వెహికిల్ ఇన్సూరెన్స్ నుంచి మాత్రం తప్పించుకోలేరు. ఇది మోటార్ వెహికిల్స్ యాక్ట్ 1988 నిబంధన. కాబట్టి ప్రతీ వాహనదారునికి మోటార్ ఇన్సూరెన్స్‌పై అవగాహన ఉండాల్సిందే. అయితే చాలామంది మొక్కుబడిగా ఏదో ఓ ఇన్సూరెన్స్‌ను తీసుకుని సరిపెట్టుకుంటున్నారు. ట్రాఫిక్ చలాన్ల నుంచి బయటపడితే చాలన్నట్టు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్‌ను తీసుకునేందుకు పెద్దగా ఎవరూ ఆసక్తి కనబర్చడం లేదు. ఈ రకమైన వైఖరి చాలాచాలా నష్టపరుస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.




**పాలసీ కొనుగోలులో ఈ పొరబాట్లు వద్దు**

- మీ ప్రాధాన్యతలను గుర్తించకపోవడం
- అసంపూర్ణ కవరేజీతో కూడిన పాలసీలు
- యాడ్-ఆన్ కవరేజీని నిర్లక్ష్యం చేయడం
- వివిధ పాలసీలు, వాటి ప్రీమియంలను పరిశీలించకపోవడం
- నో క్లెయిమ్ బోనస్‌లను పట్టించుకోకపోవడం

### సమగ్ర పాలసీ అవసరం

కార్ ఇన్సూరెన్సైనా, బైక్ ఇన్సూరెన్సైనా సమగ్ర రీతిలో ఉండాలి. మీరు తీసుకున్న వెహికిల్ ఇన్సూరెన్స్ మీ వాహనానికి ఓ భద్రతా వలయంలా రక్షణనివ్వాలి. కేవలం థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్‌పైనే దృష్టి పెట్టకూడదు. ఉదాహరణకు ఒకవేళ మీ ఇంటి బయట పార్క్ చేసిన కారుపై దగ్గర్లోని ఓ చెట్టు కొమ్మ విరిగి పడింది. దీనివల్ల కారుకు బాగానే నష్టం వాటిల్లింది. లేదా ఉదయం లేచిచూసే సరికి మీ అపార్ట్‌మెంట్ అవతలనున్న మీ బైక్‌ను దొంగిలించారు. ఇలాంటి సందర్భాల్లో మీరు తీసుకునే బీమానే మీకు రక్ష. అలాగే వరదలు, భూకంపాల వంటి ప్రకృతి విపత్తులు, అల్లర్ల వంటి వాటిలో నష్టం జరిగినా వాహన బీమా వర్తిస్తుందన్నది మరువద్దు. కాబట్టి అన్ని కోణాల్లో ఆలోచించి, ఆరా తీసి ఓ సమగ్ర పాలసీని తీసుకోవాలి.




### థర్డ్-పార్టీ బీమా అంటే?

కార్ ఇన్సూరెన్స్, బైక్ ఇన్సూరెన్స్‌ల్లో థర్డ్-పార్టీ బీమా చాలా ముఖ్యమైనది. మోటార్ ఇన్సూరెన్స్‌లో ఫస్ట్-పార్టీ వాహన యాజమాని (ఇన్సూరెన్స్‌ను కొన్నవారు). సెకండ్-పార్టీ ఇన్సూరెన్స్‌ను అమ్మినవారు (బీమా సంస్థ). థర్డ్-పార్టీ ఏదైనా ప్రమాదంలో మీ వాహనం వల్ల నష్టపోయినవారు, గాయాలపాలైనవారు, చనిపోయినవారు. చికిత్సకు వైద్య ఖర్చులు, ఆస్తి నష్టానికి నగదును ఈ కవరేజీలో బీమా సంస్థనే అందిస్తుంది. థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్ లేకపోతే ఈ ఖర్చులన్నీ వాహనదారుడి నెత్తిపైనే పడుతాయి. కనుక తప్పకుండా అత్యుత్తమ బీమాను తీసుకోవాలి. గడువు దాటక ముందే రెన్యువల్స్ చేస్తూపోవాలి. అయితే ప్రమాదంలో మీకు (ఇన్సూరెన్స్‌ను కొన్నవారు), మీ వాహనానికి జరిగిన నష్టం మాత్రం థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్ పరిధిలోకి రాదు.

### ఇది గుర్తుంచుకోండి..

సరైన వాహన బీమా పాలసీని తీసుకోవడం వల్ల మీ కారు, బైక్‌లకే కాదు.. మీకూ అనేక లాభాలుంటాయి. కాబట్టి మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ రకాల మోటార్ ఇన్సూరెన్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించి ఓ నిర్ణయానికి రావాలి. ఈ క్రమంలో క్యాష్‌లెస్ గ్యారేజ్ నెట్‌వర్క్స్, ప్రీమియం ధరలు, యాడ్-ఆన్ ఫీచర్లు, బీమా సంస్థకున్న విశ్వసనీయత, కవరేజీ వంటి వాటిని ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలి. కాగా, మెకానికల్ లేదా ఎలక్ట్రికల్ బ్రేక్‌డౌన్ జరగడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే వాహనం నడిపి ప్రమాదాలకు గురికావడం, మద్యం సేవించి వాహనాలు నడుపడం వంటి నిబంధనల ఉల్లంఘనల్లో కవరేజీలు వర్తించవు.

## దీర్ఘకాలిక పెట్టుబడులే మేలు

### స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌పై నిపుణుల సలహా

**దేశీయ** స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టాలనుకునే మదుపరులు.. దీర్ఘకాలిక పెట్టుబడులపై దృష్టి సారించాలని మెజారిటీ నిపుణులు సూచిస్తున్నారు. ఇటీవలే మునుపెన్నడూ లేనివిధంగా బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 76,000 మార్కును, నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 23,100 స్థాయిని తాకిన విషయం తెలిసిందే. దీంతో ఈ ర్యాలీ వెనుక ఆకర్షణీయమైన కార్పొరేట్ త్రైమాసిక ఫలితాలు, బలమైన ఆర్థికాంశాలున్నాయని ఎక్స్‌పర్ట్స్ విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలోనే రిటైల్ ఇన్వెస్టర్లు.. క్వాలిటీ స్టాక్స్‌ను కొనేందుకున్న అవకాశాలను పరిశీలించాల్సిందిగా సలహా ఇస్తున్నారు. కార్పొరేట్ బ్యాలెన్స్ షీట్లు ఐదేండ్ల క్రితంతో పోల్చితే క్లీన్‌గా ఉన్నాయని, విస్తరణకు వీలు కూడా ఉందంటున్న విశ్లేషకులు.. ఈ కంపెనీల షేర్లలో పెట్టుబడులకు ఇదే సరైన సమయమని కూడా చెప్తున్నారు. కాగా, ఎన్నికలు, ఫలితాల దృష్ట్యా కొద్ది రోజుల వరకు మార్కెట్లలో ఒడిదొడుకులు తప్పవని కూడా పేర్కొంటున్నారు.

**ఈ రంగాల్లో..**

ఆటోమోటివ్, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కన్జ్యూమర్ డిస్క్రీషియనరీ షేర్లు ఆకర్షణీయంగా ఉన్నాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్స్, ఎఫ్ఎంసీజీ, ఐటీ, కెమికల్ రంగాల షేర్లలోనూ పెట్టుబడులకు వీలున్నది. కాబట్టి ఇన్వెస్టర్లు తమ ఆర్థిక లక్ష్యాలకు, అందుబాటులో ఉన్న నగదు నిల్వలకు, రిస్కును భరించే స్థాయికి అనుగుణంగా పెట్టుబడులకు వెళ్లవచ్చు. నిజానికి ఈ ఏడాదిలో ఇప్పటిదాకా బీఎస్ఈ సెన్సెక్స్ 4 శాతం వరకు పుంజుకున్నది. భారతీయ ఈక్విటీల్లో నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ) తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నా సూచీలు రికార్డు గరిష్ఠాలకు చేరడం కలిసొచ్చే అంశమేనని చెప్పవచ్చు. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా ఎఫ్‌పీఐలు దాదాపు రూ.21,000 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు మరి.

**కంపెనీలు** తమ త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటిస్తున్నాయి. చాలా సంస్థలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. రిటైల్ ఇన్వెస్టర్లు దీర్ఘకాలిక పెట్టుబడులకే వెళ్లాలి. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)ను పరిశీలించవచ్చు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని లాభాలను ఆర్జించవచ్చు.

*-తేజస్ ఖోడే, ఫీర్స్ వ్యవస్థాపక సీఈవో*



**స్టాక్** మార్కెట్లు పెరగడం వెనుక బలమైన కారణాలే ఉన్నాయి. కనుక ఇది నిలకడైన ర్యాలీగానే చెప్పుకోవచ్చు. మున్ముందు సూచీలు మరింతగా పెరిగే వీలుందనే అనుకుంటున్నా. కాబట్టి దీర్ఘకాలిక పెట్టుబడులకు అనువుగానే భావించవచ్చు. ఇక ఈక్విటీల్లో రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం తక్కువగా ఉన్నది. ఇంకా పెరగాలి.

*-ఉపాసన భరద్వాజ్, కొటక్ మహీంద్రా బ్యాంక్ ప్రధాన ఆర్థికవేత్త*



**పోర్ట్‌ఫోలియోల్లో** వైవిధ్యం, బలమైన మూలాలున్న క్వాలిటీ స్టాక్స్‌లో పెట్టుబడులు, ఊహాజనిత ట్రేడింగ్‌కు దూరంగా ఉండటం వల్ల స్టాక్ మార్కెట్ రిస్కులను మదుపరులు అధిగమించవచ్చు. ముఖ్యంగా స్వల్పకాలిక పెట్టుబడులకు వెళ్లకుండా కనీసం 2-3 ఏండ్లైనా దీర్ఘకాలిక పెట్టుబడులకు వెళ్లాలి.

*-వినాయక్ మెహెతా, ఇన్ఫినిటీ గ్రూప్ వ్యవస్థాపక డైరెక్టర్*



## నెలకు 2 లక్షల పెన్షన్ కావాలా?

### ఎన్‌పీఎస్ రిటైర్మెంట్ ప్లాన్ తెలుసుకోండిలా..

**ప్రస్తుతం** మీ వయసు 30 ఏండ్లైతే.. మీ పదవీ విరమణ అనంతరం నెలకు రూ.2 లక్షల పెన్షన్ కోసం రూ.5 కోట్ల కార్పస్ ఫండ్ అవసరం.

ఇందుకు నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) అనువైనదిగా చెప్పవచ్చు. ఎన్‌పీఎస్ అనేది స్టాక్ మార్కెట్ లింక్డ్ స్కీమ్. ఇందులో పెట్టిన పెట్టుబడుల సగటు వార్షిక వృద్ధి ఏటా 10 శాతంగా ఉంటున్నది. అందుకే మెరుగైన మీ పెన్షన్ అవసరాలకు ఎన్‌పీఎస్ సరైనదని ఆర్థిక నిపుణులు సైతం అంటున్నారు.

**నెలకు రూ.22,150**

నెలనెలా దాదాపు రూ.22,150ని పెట్టుబడిగా పెడితే 30 ఏండ్లలో మీ పెట్టుబడులు రూ.5 కోట్లకు చేరుతాయి. చక్ర వృద్ధి ప్రయోజనం ఇదే మరి. 30 ఏండ్లలో మీ పెట్టుబడులు రూ.79.74 లక్షలు. దీనిపై ఏటా 10 శాతం వృద్ధితో మరో రూ.4.21 కోట్లు సమకూరుతాయి. దీంతో కార్పస్ ఫండ్ రూ.5 కోట్లుగా ఉంటుంది. అప్పుడు నెలనెలా మీ రిటైర్మెంట్ వయసులో రూ.2 లక్షల పెన్షన్‌ను అందుకోవచ్చని పర్సనల్ ఫైనాన్స్ ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు.

**ఇదీ సంగతి..**

మీరు రిటైరైనప్పుడు మీకు రెండు మార్గాలుంటాయి. అవి ఓ యాన్యుటీ ప్లాన్‌లో మీ మొత్తం సొమ్మును పెట్టుబడిగా పెట్టి పెన్షన్ తీసుకోవడమో లేదా రిటైరైన తర్వాత వచ్చిన ఆ సొమ్ములో 60 శాతం ఉంచుకుని, మిగతా 40 శాతంతో యాన్యుటీ ప్లాన్‌లో చేరడమో అవుతుంది. అయితే ప్రస్తుత ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ) రేట్లను గమనిస్తే.. ఇంకా 6-7 శాతంగానే ఉన్నాయి. ఎఫ్‌డీల్లో నగదును పెట్టడం సురక్షితమే అయినా.. ఆశించిన లేదా ఆకర్షణీయ రాబడులు రావు. దీనికన్నా ఎన్‌పీఎస్‌లో పెట్టుబడులతో ఎక్కువ ఆదాయం పొందవచ్చు. అయితే ఎన్‌పీఎస్.. మార్కెట్ రిస్కులకు లోబడి ఉంటుంది. అయినప్పటికీ దీర్ఘకాలంలో మెరుగైన రాబడులనే అందిస్తుందన్న నమ్మకం పెట్టుకోవచ్చు. కానీ పెట్టుబడులకు దిగే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకుంటే మరింత ధీమాగా ఉండవచ్చు.



### మార్కెట్ పల్స్

**గత** వారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలనే చవిచూశాయి. లోక్‌సభ ఎన్నికల భయాల నడుమ మదుపరులు లాభాల స్వీకరణకే పెద్దపీట వేశారు. దీంతో అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,449.08 పాయింట్లు క్షీణించి 73,961.31 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 426.40 పాయింట్లు పతనమై 22,530.70 దగ్గర నిలిచింది. ఈ

## ఫలితాలే దిక్సూచి



క్రమంలో ఈ వారం కూడా సూచీలు నష్టాలనే మూటగట్టుకోవచ్చన్న అంచనాలున్నాయి. మంగళవారం ఎన్నికల ఫలితాలు రానుండటంతో ఒడిదొడుకులకూ వీలున్నదని ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు ఈ వారం కూడా మార్కెట్లను నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 22,100 పాయింట్ల స్థాయి కీలకం. దీనికి దిగువన ముగిస్తే 21,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 23,000-23,200 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.